రోడ్డుపై గుంత.. మరమ్మతులు చేసిన ట్రాఫిక్ కానిస్టేబుల్



చందానగర్ : గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ ముందు ఉన్న ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. గమనించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ అశోక్‌కుమార్ అటుగా వెళ్తున్న సిమెంట్ రెడీమిక్స్ లారీ ఆపి కొంత సిమెంట్‌ను తీసుకొని గుంతను పూడ్చారు. దీంతో వాహనదారులు ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను అభినందించారు.

హెచ్‌సీయూకు ప్రతిష్టాత్మక ప్రాజెక్టు మంజూరు

రాయదుర్గం: ఆరోగ్య సంరక్షణలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లను పరిష్కరించడానికి హెచ్‌సీయూకు ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులో భాగస్వామ్యం లభించింది. ఆరోగ్య సంరక్షణలో సింగిల్-యూజ్ ప్లాస్టిక్ పర్యావరణ, ఆరోగ్య ప్రభావాలను పరిష్కరించే లక్ష్యంతో ఒక మార్గదర్శక అంతర్జాతీయ ప్రాజెక్టులో భాగస్వామ్యం కావడానికి హెచ్‌సీయూకు అవకాశం లభించింది. ఈ అంశాన్ని హెచ్‌సీయూ ఆంత్రోపాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నందకిషోర్ కన్నూరి సోమవారం వివరించారు.

ఉచిత కంటి పరీక్షలు

చందానగర్: చందానగర్ సర్కిల్- 21 కార్యాలయం ఆవరణలో మదీనాగూడలోని మ్యాక్స్‌విజన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఉపకమిషనర్ శశిరేఖ శిబిరాన్ని ప్రారంభించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. సర్కిల్ 21 ఉద్యోగులు ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్లు సోహెల్, హరికృష్ణ, సరిత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన సదస్సు

మాదాపూర్: రోగుల చికిత్సలో అత్యాధునిక వైద్య పరిజ్ఞానాన్ని అమలు చేయాలని ఏఐఎన్‌యూ మేనేజింగ్ డైరెక్టర్ యూరాలజిస్ట్ డాక్టర్ సి.మల్లికార్జున తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో రోబోల్యాప్ సదస్సు సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరాలజీ విభాగంలో చేసే శస్త్రచికిత్సల్లో రోబోల యుగం వచ్చేసిందని తెలిపారు. చిన్న కోతలతో సర్జరీ చేయాలని ప్రజలు అడుగుతున్నారన్నారు. ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో దాదాపు వెయ్యిమందికి పైగా డాక్టర్లు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లు, సంక్లిష్టమైన కేసుల గురించి చర్చించారు. భవిష్యత్తు టెక్నాలజీలు యూరాలజీ, నెఫ్రాలజీ, చికిత్సలను ఎలా మారుస్తాయన్న అంశంపై సమీక్ష చేశారు.

మల్కంచెరువుకు మరిన్ని సొబగులు

- అడ్వెంచర్ వాటర్‌స్పోర్ట్స్, బోటింగ్ సదుపాయం ప్రతిపాదన
- పర్యాటకులను ఆకట్టుకునేలా దశలవారీగా చర్యలు





రాయదుర్గం: రాయదుర్గంలోని మల్కంచెరువుకు మరిన్ని సొబగులు ఒనగూరనున్నాయి. పర్యాటకులను ఆకట్టుకునేలా దశలవారీగా చర్యలు చేపట్టనున్నారు. అడ్వెంచర్ వాటర్‌స్పోర్ట్స్ , బోటింగ్ సదుపాయం కల్పించాలని ప్రతిపాదనలు రూపొందించారు. దీంతో రోడ్‌సైడ్ లేక్ మల్కంచెరువు మరింత అభివృద్ధికి నోచుకోనుంది.

తాజాగా చేపట్టాలని అత్యాధునిక సౌకర్యాలు ఇవే..

- మల్కంచెరువు వద్ద గ్రీనరీ, లైటింగ్, వాకింగ్, సైక్లింగ్‌ట్రాక్‌ల ఏర్పాటుతో ఆకర్షణీయంగా మారిన విషయం తెలిసిందే.
- భారీగా సందర్శకులు పెరగడం, రోజురోజుకూ వాకర్స్ సంఖ్య కూడా పెరుగుతుండడంతో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం, నీటిపారుదల శాఖ, జీహెచ్‌ఎంసీ భావిస్తోంది.
- అందులో భాగంగా అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్, బోటింగ్ సదుపాయం కల్పించాలని నిర్ణయించారు.
- వాటర్‌స్పోర్ట్స్‌లో భాగంగా జెట్‌స్కీ (ఆపరేటర్ నడిపే వాటర్ స్కూటర్), జెట్ ఆటాక్ (ఆపరేటర్ నియంత్రణతో నడిపే స్కూటర్), పెడల్ బోట్లు, వాటర్ బార్బింగ్, వాటర్ సైక్లింగ్, ఎలక్ట్రిక్ డోనట్ బోట్, ఫ్లోటింగ్ డిన్నర్, సోలార్ జిప్సీ బోట్, బంపర్, బనానా బోట్, ఫ్లైబోర్డింగ్, ఇన్‌ఫ్లేటబుల్ డిస్నీ ల్యాండ్ బౌన్సీ, ఇన్ ఫ్లేటబుల్ రాకెట్ వంటివి ఏర్పాటు చేయనున్నారు.



చెరువు చుట్టూ గ్రీనరీ

- ఈ మేరకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ అనుమతి ఇవ్వాలని జీహెచ్‌ఎంసీని కోరింది.
- ఇవన్నీ ఒనగూరితే మల్కంచెరువు పర్యాటక ప్రదేశంగా తయారవుతుంది.

ప్రజావాణి.. 17 ఫిర్యాదులు



చందానగర్ సర్కిల్ 21లో.. డీసీ శశిరేఖ

చందానగర్: చందానగర్ సర్కిల్ -21 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 11 ఫిర్యాదులు వచ్చాయని ఉపకమిషనర్ శశిరేఖ తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 11 ఫిర్యాదులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మణికరణ్, ఏసీపీ నాగిరెడ్డి, ఇంజనీరింగ్ డీఈ దుర్గాప్రసాద్, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రవికుమార్, యూబీడీ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీసీ ప్రశాంతి తదితరులు

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆరు ఫిర్యాదులు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 5, అర్బన్ బయోడైవర్సిటీ విభాగానికి 1 ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీలు ప్రేమ్‌కుమార్, శ్రవణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో ఫోన్ వాడకం నిషేధం

మూసాపేట: డ్రైవర్లు విధుల్లో ఉండగా ఫోన్ వాడకం నిషేధమని కూకట్‌పల్లి ఆర్టీసీ డీఎం హరి, విజిలెన్స్ సీఎస్ఐ నాథున్‌లాల్ పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా కూకట్‌పల్లి డిపోలో సోమవారం మొబైల్ ఫోన్ల డిపాజిట్ బాక్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు ఎండీ సజ్జనార్ ఉత్తర్వుల మేరకు డ్రైవర్లు మొబైల్ ఫోన్లను డిపోలోనే డిపాజిట్ చేసి వెళ్లాలన్నారు. నగరంలో 2 డిపోలను పైలట్ ప్రాజెక్టు కింద తీసుకోగా అందులో కూకట్‌పల్లి ఒకటి అన్నారు. డిపోకు సంబంధించిన కంట్రోలర్ వద్ద ఒకటే నంబర్ ఉంటుందని, డ్రైవర్ కుటుంబ సభ్యులు అత్యవసర సమయంలో సమాచారం అందించేందుకు కంట్రోలర్‌కు ఫోన్ చేస్తే సదరు విషయాన్ని ఆయన కండక్టర్‌కు ఫోన్ చేసి సమాచారాన్ని డ్రైవర్‌కు అందజేస్తారని తెలిపారు. కంట్రోలర్ నెంబర్‌ను కుటుంబ సభ్యులకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏఎస్ఐ జనార్దన్, డిపో అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి డిపోలో ఏర్పాటు చేసిన మొబైల్ డిపాజిట్ బాక్స్

దాడి కేసులో ఆరుగురు అరెస్ట్

గచ్చిబౌలి: హాస్టల్ ఖాళీ చేయించడానికి వచ్చిన యజమానులపై దాడికి పాల్పడిన కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపారు. ఆగస్టు 25న ఇందిరానగర్‌లోని కోడూరు మాన్షన్‌లో కోర్టు ఆదేశాలతో ఫ్లాట్లు ఖాళీ చేయిస్తుండగా లీజుకు తీసుకున్న వారు దాడికి పాల్పడ్డారు. ఈ కేసులో దామ వెంకట్‌రావు(40), పాలకొనల వెంకట సుబ్బిరామిరెడ్డి(55), వెన్నం సూర్యవర్ధన్(40), కాకు మధుసూదన్(30), నంద్యమ్మ రాఘవేందర్(20), తానికొండ గోపీకృష్ణ(25)లను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు అమరనాథ్‌రెడ్డి పరారీలో ఉన్నాడని తెలిపారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రైవ్‌లో 18 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా 9 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, ఐదుగురికి రూ.1500, మరో నలుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమాన విధించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రత్యేక పూజలు

రాయదుర్గం: గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని చంద్రమౌళీశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయంలో చంద్రమౌళీశ్వరస్వామి వారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

పదవీవిరమణ పొందిన నెలలోనే పెన్షన్ ప్రయోజనాలు

పటాన్‌చెరు టౌన్: పదవీ విరమణ పొందిన నెలలోనే పెన్షన్ ప్రయోజనాలు మంజూరు చేస్తున్నట్లు ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ తెలిపారు. సోమవారం ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రాంతీయ కార్యాలయంలో ప్రయాస్ పథకం ద్వారా పదవీ విరమణ పొందిన వారిలో 10 మందికి పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కార్యాలయంలో పీఎఫ్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 'ప్రయాస్' కార్యక్రమం ద్వారా చందాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమన్నారు.



ఎఫ్‌డీడీఐలో ఆకట్టుకున్న ప్రదర్శన

రాయదుర్గం: గణేష్ ఉత్సవాల సందర్భంగా రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ క్యాంపస్‌లో విద్యార్థినులు, ఫ్యాకల్టీ ప్రతినిధుల పిల్లల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లోని స్టూడెంట్స్ సోషల్ అండ్ ఎన్విరాన్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో నృత్యం, ఫ్యాషన్ షో వంటి కార్యక్రమాలను నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. పార్వతి వేషధారణలో పార్వతి, శృతి, నిధి, సుదీక్షణలు గణేషుడు, శివుడు వేషధారణ చేశారు. విద్యార్థులను ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ తేజ్‌లోహిత్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు డాక్టర్ రాంబాబు ముప్పిడి, జ్యోతిప్రియ, అమిత్‌పూరి, గోస్వామి హుస్సేన్ , ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే గాంధీని కలిసిన భవానీపురం వీకర్ సెక్షన్ వాసులు

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని భవానీపురం వీకర్ సెక్షన్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధి పనులు చేపట్టాలని సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డితో కలిసి బస్తీవాసులు సోమవారం ఎమ్మెల్యే గాంధీకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే భవానీపురం వీకర్ సెక్షన్ కాలనీలో పర్యటిస్తానని, రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. అవసరమున్న చోట యూజీడీ పైప్‌లైన్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్ ఎగ్జిట్-17 టోల్ గేట్ మూసివేత

- గణేశ్ నిమజ్జన ఊరేగింపుల కారణంగా 2, 4వ తేదీల్లో మూసివేస్తాం
- ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలి
- రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజి

రాజేంద్రనగర్: గణేశ్ నిమజ్జన ఊరేగింపుల నేపథ్యంలో రాజేంద్రనగర్ హిమాయత్‌సాగర్, ఓఆర్ఆర్ ఎగ్జిట్-17 టోల్‌గేట్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ ఎ.బాలాజి వెల్లడించారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... నిమజ్జన ఊరేగింపు 7వ రోజు, 9వ రోజు పెద్ద ఎత్తున గణనాథులు రాజేంద్రనగర్ పత్తికుంటకు తరలివస్తారన్నారు. ఆ రోజున ఊరేగింపుతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా ఓఆర్ఆర్ పైకి వచ్చే, వెళ్లే భారీ వాహనాలను ఎగ్జిట్-16 మీదుగా దారి మళ్లిస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించాలన్నారు.

- రాజేంద్రనగర్ నుంచి హిమాయత్‌సాగర్ వరకు ఉన్న రేడియల్ రోడ్డు గణనాథుల ఊరేగింపుతో ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓఆర్ఆర్ ఎగ్జిట్-17ను తాత్కాలికంగా ఈ నెల 2, 4వ తేదీల్లో రెండు రోజుల పాటు మూసి వేస్తాయన్నారు.
- 11వ రోజు (6వ తేదీ)న గణనాథుల ఊరేగింపునకు అనుగుణంగా చర్యలు చేపడుతామన్నారు. అలాగే పీడీపీ చౌరస్తా నుంచి రాజేంద్రనగర్‌కు వెళ్లే వాహనాలను సైతం దారి మళ్లిస్తామన్నారు. ట్రాఫిక్‌కు ఎక్కడ ఎలాంటి అంతరాయం కలుగకుండా సిబ్బంది తగు చర్యలు చేపడతారన్నారు.
- ఓఆర్ఆర్‌పై నుంచి భారీ వాహనాలు వస్తాయని... వారికి ఇబ్బంది కలుగకుండా తమ సిబ్బంది డైవర్షన్‌ను వివరిస్తూ ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపిస్తారన్నారు. ఊరేగింపు నేపథ్యంలో పత్తికుంట, పల్లెచెరువు ప్రాంతాలవాసులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలన్నారు.
- స్థానికంగా ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను వాడుకోవాలన్నారు. పల్లె చెరువు వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా తమ సిబ్బంది ప్రత్యేకంగా పికెటింగ్‌ను ఏర్పాటు చేసి విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పత్తికుంట వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ఉంటుందన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
- సెప్టెంబర్ 10 న బంధం కొమ్ము, తెల్లాపూర్ రిజర్వాయర్ల ప్రారంభం

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, పట్టణాలు, డివిజన్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని.. నిర్దేశించిన గడువు లోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని మున్సిపల్ కమిషనర్లు, హెచ్‌ఎండబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఏర్పాటైన ఇంద్రేశం, జిన్నారం, ఇస్నాపూర్, గడ్డపోతారం, గుమ్మడిదల మున్సిపాలిటీలకు శాశ్వత భవనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు.నూతన మున్సిపాలిటీల పరిధిలోని గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో డంపింగ్‌యార్డ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా.. జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చించి రాంకీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్లాంటుకు చెత్తను తరలించేలా చూస్తానన్నారు. బంధంకొమ్ము, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్ పరిధిలో హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన రిజర్వాయర్లను సెప్టెంబర్ 10వ తేదీన ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమీప కాలనీల ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. గత 2 నెలలుగా కురుస్తున్న భారీ వర్షాల మూలంగా నియోజకవర్గ పరిధిలో ధ్వంసమైన రహదారులకు వెంటనే మరమ్మతులు చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పారిశుద్ధ్య పనుల పరిశీలన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పత్తికుంట వద్ద జరుగుతున్న పారిశుద్ధ్య పనులను సర్కిల్ ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి, ఏఎంహెచ్‌ఓ రజనీకాంత్ సోమవారం పరిశీలించారు. ఐదో రోజు ఆదివారం పత్తికుంటకు వందలాదిగా గణనాథుల ప్రతిమలు నిమజ్జనానికి తరలివచ్చాయి. నిమజ్జన ప్రక్రియ ఆదివారం అర్ధరాత్రి వరకు సాగింది. సోమవారం తెల్లవారుజామున 5 గంటల నుంచే పారిశుద్ధ్య సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పీడీపీ చౌరస్తా నుంచి హిమాయత్‌సాగర్ వరకు రేడియల్ రోడ్డును పూర్తిగా శుభ్ర పరిచారు. అలాగే పత్తికుంటతో పాటు పక్కనే ఉన్న ప్రత్యేక కొలనులో భక్తులు వేసిన పూజ సామగ్రిని పూర్తిగా తొలగించారు. కొలనును కొత్త నీటితో నింపారు. ఈ ప్రక్రియ ఉదయం 11 గంటల వరకు సాగింది. ఈ పనులను ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి, ఏఎంహెచ్‌ఓ రజనీకాంత్‌లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. గణేశ్ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ ఊరేగింపు నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలను కమిషనర్‌కు వివరించారు. ఈఈ నరేందర్, బీజేపీ నాయకుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

గణేశునికి ఘన పూజలు



చందానగర్ గిరిజా మార్వెల్ అపార్ట్‌మెంట్స్‌లో గణనాథుని లడ్డూను రూ. 5,30,212 లక్షలకు దక్కించుకున్న గుర్రం శ్రీకాంత్ కుటుంబం



గోపన్‌పల్లి గణనాథుని దర్శించుకున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

శేరిలింగంపల్లి : గణనాథులకు నిత్య పూజలు జరుగుతున్నాయి. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో ప్రజలు స్వామి వారిని దర్శించుకుంటున్నారు. సోమవారం గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో గణేశునికి వడమాల వేసి ప్రత్యేక అలంకారం చేశారు.

గణేష్ లడ్డూ రూ.3.20 లక్షలు

నల్లగండ్లలోని అపర్ణా సైబర్‌జోన్ గేటెడ్ కమ్యూనిటీలో ప్రతిష్ఠించిన గణనాథుడి లడ్డూ వేలంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బొల్లంపలి విజయ్‌భాస్కర్‌రెడ్డి రూ.3.20 లక్షలకు దక్కించుకున్నారు.



గోపన్‌పల్లిలో..



నల్లగండ్ల అపర్ణాసైబర్‌జోన్‌లో .. రూ.3.20 లక్షలకు లడ్డూను దక్కించుకున్న విజయ్‌భాస్కర్‌రెడ్డి



నానక్‌రాంగూడలోని భాగ్యలక్ష్మీ ఆలయం వద్ద..



నల్లగండ్లలోని అపర్ణ సరోవర్ గణేశ్ లడ్డూను రూ.13.02లక్షలకు పాడుకున్న రాజేష్ వర్మ ,శాంతిప్రియ దంపతులు



నల్లగండ్ల హుడా రెసిడెన్షియల్ అసోసియేషన్ గణనాథుడి పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్



గోపన్‌పల్లిలో.. హెచ్‌సీయూ వీసీ బీజేరావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



మల్కం చెరువు వద్ద .. నిమజ్జన వేడుకలో మణికొండ స్వర్ణ ప్యాలెస్ అపార్టుమెంట్‌వాసులు



శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, స్థానికులు